# బిడ్డ కడుపులో పడ్డాడు... దొర వూరు వదిలాడు

భూదేవి అంత పీట – ఆకాశమంత పందిరి
చుక్కబొట్టు అక్షింతలు – సూర్యుడు బాసికము

అంటూ శ్రావ్యరాగాలాపనతో పెళ్ళిళ్ళ హోరులో లయబద్ధంగా నాట్యం చెయ్యటమే తెలిసిన గిరిజన గ్రామాలు నగర సంస్కృతి ప్రభావంతో దగా పడ్డ తమతోటి మహిళల్ని తల్చుకుంటూ సరికొత్తపాటలు పాడుతున్నాయి. నగరాల నుండి వచ్చి తమని పెళ్ళిళ్ళు చేసుకుంటున్నామని మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేసినవార్ని పాటల రూపంలో ఇలా గుర్తు చేస్తున్నారు.



బేలం బాపనమ్మ

"సూర్యుడు బాణం – చుక్కబొట్టుదెబ్బ
చంద్రుడు బాణం – చెంపమీద దెబ్బ"
"దూరదేశం మనవారిచ్చిరి దుఃఖపడకు చెల్లెలమ్మా
మారు దేశం మనవారిచ్చిరి మాటపడకు చెల్లెలమ్మా"
"వింత వింత దొరల కూడి చింత కింద విచారాలు
వింత దొరలు వీడిపోగా చింత నీడలు చిమ్మినాయో"

ఇది విషాద స్వరంతో మిళితమైన వారి అనుభవం. మోసం అంటే ఏమిటో తెలియని వారి జీవితాల్లో ఎన్నో చేదు అనుభవాలు. కరిగిపోయిన స్వప్నం వర్తమానాన్ని ప్రశ్నార్థకం చేసి పెడుతున్న రంపపు కోతకు 'మౌనపోరాటం' చేస్తున్న అమాయక గిరిజన మహిళలు తమ కష్టాలను కన్నీరుతో వినిపిస్తున్నారు.

– వెంపా గంగమ్మ
– బేలం బాపనమ్మ
కత్తుల మంగమ్మ
– జనగా కాంతమ్మ
– చాపా సీతాయమ్మ

ఇలా ఎందరో పేర్లు గిరిజన గ్రామాల్లో మార్మోగుతుంటాయి. వీళ్ళందరూ నగర సంస్కృతి వయవంచనకు బలిపశువులు.

అడవి తప్ప వారికి నగరం తెలియదు. ఆట తప్ప వారికి నయవంచన వేట తెలియదు. కల్మషం లేని చూపు తప్ప వారికి విషపు నవ్వు తెలియదు.

కాని అన్ని తెలిసిన నగర నయవంచకులు వాళ్ళ నిండు నూరేళ్ళ జీవితాలను ప్రశ్నార్థకం చేశారు. కామం తప్ప కరుణ తెలియని వారు వారి జీవితాలను ఎలా దగా చేశారో వాళ్ళ మాటల్లోనే వినండి.

## కళ్ళులేని కొడుకు ఒంటరి బతుకు

సీతపల్లి – రంపచోడవరం మార్గమధ్యంలో వున్న ఇర్లపల్లి గ్రామానికి చెందిన వెంపా గంగమ్మ తన చిన్నతనంలోనే మోసపోయింది. మోసానికి గుర్తుగా కళ్ళులేని కొడుకు మిగిలిపోయాడు.

"నా చిన్నతనంలో మా పెద్దమ్మ ఇంటికని బోర్నగూడెం వెళ్ళాను. అక్కడే నాకు పుల్లల వ్యాపారం చేసే రెడ్డి సత్యనారాయణ కలిశాడు. నిన్ను పెళ్ళి చేసుకుంటా నాతో వుంటావా అని అడిగాడు. సరేనన్నా. సత్యనారాయణకు గోకవరంలో కలప వ్యాపారం. అడవిలో చెట్లు కొట్టించుకుని తీసుకు పోయేవాడు.

కొన్నాళ్ళకు నా కడుపులో బిడ్డ పడ్డాడు. దొరకు ఈ విషయం చెప్పాను. అంతే ఊరు వదిలి వెళ్ళిపోయాడు.


అప్పుడు నేను చాలా చిన్నదాన్ని ఏమీ తెలిసేది కాదు. ఆయన నన్ను వదిలి వెళ్ళిపోయిన రోజు ఏడుస్తూ కూర్చున్నాను. విషయం తెలిసి మా కుల పెద్దలు గోకవరం వెళ్ళి సత్యనారాయణన్ని నిలదీశారు.

నాతో కలిసి కాపురం చేసిన దానికి కుంచెడు బియ్యం, పది రూపాయిలు ఇచ్చి పంపించాడు"

ఇది గంగమ్మ కథ. కాపురం చేసినందుకు ఇచ్చిన నష్టపరిహారం కుంచెడు బియ్యం. ఆ రోజుల్లో సత్యనారాయణ తన చేతులు దులుపుకున్నాడు. కాని గంగమ్మకు తన విషాద జీవితాన్ని మరింత విషాద భరితం చేస్తూ గుడ్డి కొడుకుపుట్టాడు. నలభై సంవత్సరాలకే గంగమ్మ డెబ్బయి సంవత్సరాల ముసలమ్మ అయిపోయింది. ఇప్పటికీ ఇరవై సంవత్సరాల నుండి గంగమ్మ ఇర్లపల్లిలో ఒంటరిగానే బతుకుతోంది. తాను బతకటమే కాదు తన మీద ఆధారపడిన కళ్ళులేని కొడుకిని బతికించుకుంటోంది. పట్టుమని పది మంది వుండని గిరిజన గ్రామాల్లో ఎవరి బతుకువారిది. ఎవరి కష్టం వారిది. ఒకరు వచ్చి పెట్టటం వుండదు. తనకు తానే కష్టపడాలి. పోనీ కష్టపడదామన్నా అంత పనులువుండవు.

కాని గంగమ్మ పట్టుదలగా బతికింది. చూపులేని తన కొడుక్కి తానే చూపుగా మిగిలింది. చిన్న పల్లెటూరిలో చిన్న ఇంట్లో చక్కగా ముగ్గులు దిద్దిన గంగమ్మను రేపు ఎలా అని అంటే ఒక్కసారిగా నవ్వేసింది. 'నాకు మాయమ్మ ఓ చెక్క చవిడి పొలం ఇచ్చింది. అదే నాకు అన్నం పెడతాది. నా బతుకు ఇలా అయిపోయిందన్న దిగులులేదు. ఇదిగో ఈ నాగేశ్వరరావు (గంగమ్మ కొడుకు పేరు) నేను రేపు లేకపోతే ఎలా బతుకుతాడో అన్నదే నా దిగులు. మొన్న కోర్టులో ( గంగమ్మ కేసు పెట్టింది) వీడి నాన్న వచ్చాడు. నాకూ ఆయనకూ వీడుపుట్టలేదని బుకాయించాడు. అక్కడెక్కడో రక్తం పరీక్ష చేస్తారంటగా. అలా నా రక్తం పరీక్ష చేసి సత్యనారాయణకుపుట్టాడో లేదో తేల్చమని అడిగా. ఇంకా తీర్పు చెప్పలా. రక్తం పరీక్ష చేస్తే అసలు విషయం తెలిసి పోతుంది. అదే నాకు ధైర్యం" అని అన్నది.

కలప వర్తకుల నయవంచనకు గంగమ్మ బతుకు మోడులా మిగిలి పోయింది. మోడు లాంటి తన బతుకుకు బీడులా మిగిలిపోయిన కొడుకు విషయంలో గంగమ్మ జన్యు కణాల పరీక్షకు సైతం సిద్ధమైంది. అక్షరాలు కూడా రాని గంగమ్మ కోర్టులో జన్యుకణాల పరీక్ష చేయించమని కోరినప్పుడు ఎందరో అవాక్కయిపోయారు. గంగమ్మలాంటి మహిళల్ని శక్తి అనే స్వచ్ఛంద సంస్థ చైతన్యవంతం చేసింది. ఇలాగే మరెంతో మంది మహిళల్ని మేల్కొలిపింది. ఫలితంగా ఇప్పటి వరకు కుగ్రామాల్లో మ్రగ్గిపోతున్న గిరిజన మహిళలు న్యాయం కోసం దరఖాస్తులు చేస్తున్నారు. ఇదే కోవలో మరి కొంతమంది కథనాలు.



మారేడుమిల్లికి చెందిన పాకల పాటిలక్ష్మిని పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారు. తమ కాపురానికి గుర్తుగా లక్ష్మి ఇద్దరు పిల్లల్ని కన్నది.

తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పకున్నా ఎవ్వరూ సాక్ష్యం చెప్పనందున లక్ష్మికి న్యాయస్థానంలో కూడా ఎదురుదెబ్బ తగిలింది. పుట్టింటికి కూడా దూరమైన లక్ష్మి తన ఇద్దరు పిల్లలతో ఒంటరిగా జీవించడం ప్రారంభించింది. అన్ని దశల్లో ఎదురుదెబ్బలు తింటూ వచ్చిన లక్ష్మికి ఇల్లు కూడా కరువైంది. తన పిల్లల్ని బ్రతికించుకొనేందుకు చిన్న చిన్న బట్టలు కుట్టుకుంటూ కాలం గడుపుతోంది. ఎన్ని బట్టలు కుడితే పస్తులులేకుండా ఇల్లు గడుస్తుంది. అందుకే లక్ష్మికి ప్రతిరోజు ఒక నరకంలా వుంటుంది.

## ఈ బతుకు మరెవ్వరికి వద్దు

చిన భీరంపల్లి గ్రామానికి చెందిన బేలం బాపనమ్మను అటవీ శాఖలో పని చేసే జనార్ధనరావు పెళ్ళి చేసుకున్నట్టు నటించాడు. ఉద్యోగ రీత్యా వున్నంత వరకు బాపనమ్మతో కాపురం చేసి ముగ్గురు ఆడపిల్లలకు జన్మనిచ్చాడు. ఉద్యోగం బదిలీ కాగానే బాపనమ్మను మర్చిపోయాడు. ఇద్దరు ఆడపిల్లలు, ఒక కొడుకుతో ఒంటరిగా కాలం గడుపుతున్న బాపనమ్మ నోరు చాలా గడుసుది. ఆమెతన జీవితం నేర్పిన పాఠశాల నుండి ఎన్నో సత్యాలు అలవోకగా చెబుతుంది.


నగరాల నుండి వచ్చినవారిని ఏజెన్సీలో ప్రజలు పల్లపోళ్ళు దిగువ నుండి వచ్చిన వాళ్ళు అని పిలుస్తారు.

పల్లపోళ్ళు వచ్చారు మా బతుకులు బుగ్గి చేశారు. ఈ వయస్సులో నేను ఏమి చెయ్యాలి. ముగ్గురుపిల్లల్ని ఎలా పెంచను. ఎంత కూలి చేస్తే ఈ ఇల్లు గడుస్తుంది. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే నిజాయితీ ఈ వ్యవస్థకు వుందా? బాపనమ్మ, గంగమ్మ లాంటి నిరుపేదలు కామం తీర్చుకొనే సాధనాలుగా మిగిలి పోతున్నారు.

మారేడుమిల్లి మండలం తాడేపల్లి గ్రామానికి చెందిన కత్తుల మంగమ్మ, గంగవరం మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన జనపరెడ్డి బుచ్చమ్మ, సింగంపల్లి గ్రామానికి చెందిన చాపా సీతాయమ్మ, వేటకూర గ్రామానికి చెందిన లక్కోండ కాంతమ్మ, కుందాడ గ్రామానికి చెందిన కుండ్లలక్ష్మి, మారేడుమిల్లికి చెందిన దుంగ చింతలమ్మ, సోలాపల్లి రాఘవ, పెద భారంగికి చెందిన కారం రమణ ఇలా ఎందరో నగర సంస్కృతి నయవంచనకు బలి పశువులు అవుతున్నారు.

పై వారందరికీ కనీసం తమను మోసం చేసినవారి చిరునామాలైన దొరి కాయి. చిరునామాలే లేకుండా తప్పించుకుపోయిన వారి క్రౌర్యానికి బలైపోయిన గిరిజన మహిళలు తమకు జరిగిన అన్యాయన్ని సైతం చెప్పకోలేని దుస్థితి.

ఆడవారిని అడవి జీవాలు మోహిస్తాయని గిరిజనులు నమ్ముతారు. అడవి జంతువులుమోహిస్తాయేమో గాని మోసం చెయ్యలేవు కదా! కాని నగరాల నుండి వచ్చిన కొన్ని మగ జీవాలు మోహించటమే కాదు జీవిత కాలానికి సరిపడా శిక్షలు విధించాయి.



వెంపా గంగమ్మ, కొడుకు నాగేశ్వరరావు